క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ బి. కోటేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులంతా తమ సలహాలు, ఫిర్యాదులను డిపో మేనేజర్ 9959225430 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

సంతోషరావు మృతి పార్టీకి తీరని లోటు



పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీనివాస కాలనీ 7వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చల్లగుండ్ల సంతోషరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ సంతోషరావు పార్టీకి ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అశ్రద్ధ వద్దు



పిడుగురాళ్ల: టీబీ వ్యాధిపై అశ్రద్ధ వద్దని టీబీ యూనిట్ టీవీహెచ్‌వీ సీహెచ్. అర్జున్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సాయి వృద్ధాశ్రమంలో బుధవారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీహెచ్‌వీ అర్జున్‌కుమార్ మాట్లాడుతూ టీబీ విముక్త భారత్ అభియాన్ సర్వేలో భాగంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రోజుల తరబడి దగ్గు, నీరసం, జ్వరం ఉన్న పక్షంలో వెంటనే వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శివపార్వతి, ఆశా షేక్ మహిజిన్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



కారెంపూడి: పంచాయతీ పురోగతి 2.0పై ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పురోగతికి పంచాయతీ రాజ్ శాఖ కీలకంగా నిర్దేశించిన తొమ్మిది అంశాలపై గ్రామాల వారీగా అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాలు స్వయం సమృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని తెలిపారు. పరిశుభ్రమైన పచ్చదనంతో కూడిన మంచి వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. బాలికలు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, డెప్యూటీ ఎంపీడీఓ కసిన్యా నాయక్, ఏఓ పోట్ల నరసింహారావు, ఏపీఎం నరసింహారెడ్డి, ఎంఈఓ సుబ్బారావు, మలేరియా సూపర్‌వైజర్ లాలూ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో మహిళా సర్పంచుల పాత్ర కీలకం



సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధుల వినియోగం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో మహిళా సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహిళా సర్పంచులకు సాధికారత, అభివృద్ధి ప్రణాళికలపై పూర్తి స్థాయి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7 నుంచి అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల నుంచి 34 మంది మహిళా సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా నాయకత్వం, స్థానిక పాలనలో మార్పులు, పనుల విభజన, పంచాయతీరాజ్ చట్టాలు, సర్పంచుల విధులు, ఆర్థిక వనరులు, గ్రామసభల నిర్వహణ వంటి 12 అంశాలపై శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. రుద్రవరం, మాచవరం పంచాయతీ కార్యదర్శులు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ట్రైనింగ్ డిప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరావు, రూపవతి, మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మరపురాని మహానేత వైఎస్సార్

- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- రాత్రి సైతం జయంత్యుత్సవాలు



కరాలపాడులో అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: మరపురాని మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కొనియాడారు. మనస్సున్న మహారాజు, పేదల పాలిట దేవుడైన ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయులని పేర్కొన్నారు. మండలంలోని కరాలపాడు, గుత్తికొండ గ్రామాల్లో అర్ధరాత్రి సైతం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరాలపాడులో సీపీఐ స్తూపం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అదే గ్రామంలోని రాజశేఖర్‌రెడ్డి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, అన్నదానాన్ని ప్రారంభించారు. మెయిన్ సెంటర్‌లో జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదానాన్ని ప్రారంభించారు. యాదవల బజారులో ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్‌కుమార్, మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, సర్పంచ్ చల్లా పిచ్చిరెడ్డి, యువజన విభాగ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మండల మాజీ కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు సత్తార్ సీతారామిరెడ్డి, నంబూరి పుల్లారెడ్డి, బుర్రి సీతారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అన్నబోతుల గురవారెడ్డి, ముడేల శ్రీనివాసరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, దావీదు, మాజీ సర్పంచ్ గద్దెగంటి శ్రీనివాసరావు, పిడుగురాళ్ల మండల జేసీఎస్ ఇన్‌చార్జి భూమిరెడ్డి యల్లారెడ్డి, అబ్దుల్లా, మద్దసాని రమణారెడ్డి, షేక్ బాజీ, ఇస్మాయిల్, సైదా హుస్సేన్, జగన్, తోటపల్లి రాజారెడ్డి, మునలయ్య, సంకుల రవి పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేసిన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు

మాచర్ల: మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో సైతం మహనీయుడి జయంతిని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు పాడుపడాలని తెలిపారు.

గుత్తికొండలో.....



గుత్తికొండలో కేక్ కటింగ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైఎస్సార్ 76వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ కుంభా అచ్చయ్య కుమారుల పట్టువస్త్రాల కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మండల మాజీ కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కావూరి రామాంజనేయులు, బండ్ల రామారావు, వైస్ సర్పంచ్ వాలునాయక్, ఎంపీటీసీ సభ్యుడు నల్లబోలు వెంకట్రావు, మొగిలి వెంకటేశ్వర్లు, యూత్ మాజీ అధ్యక్షులు రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాంబశివరావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బదిలీ చేసిన ప్రాంతానికే పంపించాలి



ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

వెల్దుర్తి: బదిలీ చేసిన ప్రాంతానికే తమను వెంటనే పంపించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు వెల్దుర్తి మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న ప్రాంతాల నుంచి తమను బదిలీ చేయడం లేదని చెప్పారు. సాధారణ బదిలీల్లో తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ అయినప్పటికీ, డిప్యూటేషన్లపై ఇక్కడే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. తమను బదిలీ చేయకుండా నిలిపి వేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. తమను వెంటనే బదిలీ అయిన ప్రాంతానికి రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ



దాచేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

దాచేపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ఎస్.అమూల్య సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా దాచేపల్లి పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అమూల్య మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మయ్య, సరస్వతి, లలిత కుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా విడుదల



ఆర్ఎస్‌కేలో జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మాచర్ల: అన్నదాత సుఖీభవ పథక అర్హుల జాబితాలను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి బుధవారం తెలిపారు. మండల పరిధిలోని రైతులందరూ జాబితాలో పేర్లు తనిఖీ చేసుకోవాలని ఆమె సూచించారు. పథకానికి అర్హత ఉండి, జాబితాలో పేర్లు లేని రైతులంతా గ్రామ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌లో పోర్టల్‌లో ఈ నెల 13వ తేదీలోపు ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది అంజి నాయక్, శ్రావణి పాల్గొన్నారు.

సస్యరక్షణతో పత్తిలో అధిక దిగుబడులు



పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

రెంటచింతల: సస్యరక్షణ చర్యలతోనే పత్తిలో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జెట్టిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఆయన రైతులకు గులాబీ రంగు పురుగు, వివిధ తెగుళ్ల నిర్మూలనకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. సాగులో సేంద్రియ ఎరువులను వేయడం వల్ల పంటలకు సూక్ష్మపోషకాలు సమృద్ధిగా లభించి, తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. వేసవిలో లోతు దుక్కులను దున్నుకోవాలని సూచించారు. పంటలు వేసే ముందు పచ్చిరొట్ట పైరును, పశువుల ఎరువును వేసుకోవాలని పేర్కొన్నారు. పత్తిలో రసం పీల్చు పురుగు నివారణకు ఐదు శాతం వేప కషాయం లేదా ఇమిడాక్లోఫిడ్‌లను పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఎకరాకు ఐదు శాతం వేప గింజల కషాయం లేదా 250 ఎం.ఎల్. వేప నూనె గానీ డైయజోఫాస్(ఓస్టాతియన్)ను 2.5 ఎం.ఎల్. గానీ ఏసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేయడం వల్ల తెల్లదోమ ఉధ్ధృతిని నివారించవచ్చని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఉధ్ధృతంగా ఉన్నప్పుడు ఎకరాకు 6 నుంచి 8 లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని నివారించవచ్చని వివరించారు. పత్తిలో తెల్లదోమ ఎక్కువగా ఉంటే 20 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. సాగుచేసే ముందు పంటల భీమా పథకంలో చేరాలని సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పప్పు ధాన్యాలు ఎకరానికి రూ. 40, ఎర్ర మిర్చి ఎకరాకు రూ. 360, వరి ఎకరానికి రూ. 80 చెల్లించాలని తెలిపారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) ఎకరాకు రూ. 1900 చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ కోఆర్డినేటర్ డి. కిరణ్‌కుమార్, మండల కోఆర్డినేటర్ ఏసోబు, వీఏఏ జగన్, వీఎంఏ కె. మంజుల పాల్గొన్నారు.

కార్మికులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

- అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి జ్యోతిశ్రీ
- పెదకూరపాడులో సార్వత్రిక సమ్మె విజయవంతం



పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

పెదకూరపాడు: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి, పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. నియోజవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సార్వత్రిక సమ్మె నేపథ్యంలో బస్టాండ్ సెంటర్‌లో బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులపై చూపిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రైవేటీకరణకు బానిసలుగా మారిన పాలకులను ప్రజలు హెచ్చరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పల్నాడు జిల్లా సీఐటీయూ మహిళా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ ఈ సమ్మె ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రజా ఉద్యమాల ప్రారంభానికి నిదర్శనం మాత్రమే అన్నారు. సీపీఐ కార్యదర్శి పట్టణ కార్యదర్శి పఠాన్ నాగుల మీరా, నేలపాటి ఏసోబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్మికుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆటో వర్కర్స్, పంచాయతీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి హుస్సేన్



మాట్లాడుతున్న షేక్ హుస్సేన్

గురజాల : పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా బుధవారం స్థానిక పాత పాటేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి బస్టాండ్ మీదుగా బ్రహ్మనాయుడు విగ్రహం వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐసీటీయూ, రైతు, కూలి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ హుస్సేన్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాని, అంబానీలకు దోచి పెట్టే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్సును తెచ్చిందని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు షేక్ హుస్సేన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి, సీఐటీయూ పల్నాడు జిల్లా నాయకులు పోలేపల్లి అబ్రహం లింకన్, ఎంసీపీఐ(యూ) నాయకులు నాగేశ్వరరావు, నెల్లూరు రామకోటయ్య, రాజువరపు వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దేవకుమారి, రత్నం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలి

రెంటచింతల: కార్మికుల హక్కులకు భంగం కల్గించే కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు. కార్మిక చట్టాలను రద్దుచేయాలని కోరుతూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ సేవకుల, కార్మికులతో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుట్టి మరియదాసు, తోటిచర్ల ఎలీషా పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

మాచర్ల: కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం మాచర్ల పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, సీటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్మిక నేతలు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ తెచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రింగ్‌రోడ్డు సెంటర్ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో పలువురు కార్మిక నేతలు మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సీటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్రహం లింకన్, సీఐటీయూ నాయకులు బి.మహేష్, కార్మిక సంఘ నాయకులు నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, బాబూరావు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.



దాచేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

పిడుగురాళ్ల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, సీటీయూ, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి గెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి నాలుగు వేతన కోడ్స్ తీసుకువచ్చిందని తెలిపారు. దీనివల్ల కార్మికులు బికారులుగా మారతారని, వెంటనే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు మందపాటి రమణారెడ్డి, సీటీయూ నాయకులు ఓర్సు కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు అక్కినపల్లి బాలయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి. శాంతమణి, ఎస్‌కే హజరా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బత్తుల రామారావు, దేవరకొండ మార్తమ్మ, కంపా వీరమ్మ, మార్తమ్మ, గద్దె శ్రీను, వేముల శ్రీను, రిక్షా సంఘ నాయకులు షేక్ బాబు, కోటేశ్వరరావు, హమాలీ వర్కర్స్ సీనియర్ నాయకులు ఎస్. సంపతి వెంకట కృష్ణ, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు జగన్నాథం, ఏసు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం

దాచేపల్లి : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమెర వెంకటరావు అన్నారు. కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయకుండా, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. దేశవాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం దాచేపల్లిలో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలని ప్రయత్నిస్తోందని, దీన్ని పోరాటాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లంక శాంతి, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి అనుముల లక్ష్మారెడ్డి, నాయకులు బుర్రా కృష్ణారెడ్డి, టి.సత్యనారాయణ, రామయ్య, కొండలు, ఎం.సర్వయ్య, ఆనంద్ కుమార్, రాజశేఖర్, ఎడ్ల భాస్కర్, గోల మల్లేశ్వరి, బొమ్మిరెడ్డి పద్మ, ఇందిర పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే పూర్వ వైభవం ఖాయం

నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దిశానిర్దేశం



మారూరి శివారెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పదవులు స్వీకరించిన వారందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. నరసరావుపేట మండల ఉపాధ్యక్షులుగా నియమితులైన మారూరి శివారెడ్డి తన కేసానుపల్లి గ్రామం, ఎస్ఆర్‌కేటీ కాలనీ వాసులతో బుధవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువ కప్పి పూల దండలతో సత్కరించారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులే ఎమ్మెల్యేలుగా గెలిచారన్నారు. పల్నాడు ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తూ జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసినట్లు చెప్పారు. అయితే గత ఎన్నికల్లో కూటమి నాయకులు మోసపు వాగ్దానాలతో ప్రజలను తమవైపునకు తిప్పుకోవడంతో ఓటమి పాలయ్యామన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కూటమి నేతల మోసాలను తెలుసుకుంటున్నారని అన్నారు. రాబోయే రోజులు మనవేనని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. మారూరి శివారెడ్డి పార్టీ ఏర్పడినప్పటి నుంచి కొనసాగుతూ కేసానుపల్లి, ఎస్ఆర్‌కేటీ కాలనీల్లో పార్టీ అభివృద్ధికి కృషిచేశారన్నారు. మారూరి మాట్లాడుతూ తనకు అప్పచెప్పిన బాధ్యతలను నెరవేర్చి మళ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సంతగుడిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లకి అంజనారెడ్డి, మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పలువురు డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కార్యనిర్వాహక అధ్యక్ష పదవి స్వీకరించినందుకు అభినందించి సన్మానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

బడ్డీ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు



గురజాల : బడ్డీ బంకుల్లో డీఎస్పీ బి. జగదీష్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గుట్కా, ఖైనీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, దేవాలయాలకు వంద మీటర్ల దూరంలో పొగాకు, ఖైనీ, గుట్కాలు అమ్మకూడదని తెలిపారు. నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ అనంత కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల చైర్‌పర్సన్‌లు, పర్సన్ల నియామకం

రొంపిచర్ల: మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన పాలక వర్గాలను నామినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విప్పర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్‌గా మాజీ ఎంపీపీ జల్లిపల్లి శేషమ్మను, పర్సన్‌లుగా యామర్తి అంజలీదేవి, గంగారపు శ్రీనివాసరెడ్డి, సంతగుడిపాడు ప్యాక్స్‌కు పునుగోటి శ్రీనివాసరావు చైర్ పర్సన్‌గా, పర్సన్‌లుగా మోదుగుల కొండలు, కల్లూరి ఆంజనేయులు. బుచ్చి బాపన్న పాలేనికి చైర్‌పర్సన్‌గా సూరాబత్తుల రామారావు, పర్సన్‌లుగా ఎం. కొండారెడ్డి, బండారు పిచ్చమ్మ, రొంపిచర్ల ప్యాక్స్‌కు పల్లెల వెంకటరత్నారెడ్డి చైర్‌పర్సన్‌గా, వీరవల్లి సుబ్బయ్య, ఇంటూరి రాజశేఖర్‌రెడ్డి పర్సన్‌లుగా, అన్నవరం ప్యాక్స్‌కు కుందేటి రామబ్రహ్మం చైర్ పర్సన్‌గా, కామినేని వెంకట రంగారావు, గుండపనేని కోటేశ్వరరావులను పర్సన్‌లుగా నియమించారు. లింగంగుంట్ల సొసైటీకి చైర్‌పర్సన్‌గా కన్యదార రాజు, పర్సన్‌లుగా షేక్ గూడు మహబూబ్ బాషా, సుద్ధపల్లి నవీన్, జొన్నలగడ్డ సొసైటీకి చైర్ పర్సన్‌గా యర్రం రాంబాబు, పర్సన్‌లుగా ముప్పాళ్ల వెంకట నరసింహారావు, దుగ్గి బాబురావు, ఇక్కుర్రు సొసైటీకి చైర్ పర్సన్‌గా కొల్లు వెంకటేశ్వర్లు, చెరుకూరి కావేరి, కుంబా పోలయ్యలను నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.